

హస్త కళలను కాపాడండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

భారతీయ హస్తకళలు సాంస్కృతిక ప్రతీకలనీ, వాటిని కాపాడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి కోరారు. హస్త కళల పరిరక్షణలో తన వంతు పాటుపడుతున్న జిల్లా కలెక్టర్ అభినందనీయుడని కొనియాడారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వర స్వామి దారు శిల్పాన్ని బహూకరించారు. మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు, జయముని ఆచారి తదితరులు పాల్గొన్నారు.

'ముక్కంటీశుని' సేవ 'రంగినేనికే'నా..!

స్పష్టం చేసిన ఎంఎల్ఎ బొజ్జల
వారంలో ప్రకటించే అవకాశం
అనూహ్యంగా కోలాఆనంద్ పేరూ...
నైరాశ్యంలో ఆశావాహులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా, వంద కోట్ల వార్షికాదాయం పొందుతున్న ఆలయాల్లో మూడోదిగా శ్రీకాళహస్తీశ్వరాలయం ఖ్యాతికెక్కింది. ఈ నేపథ్యంలో ఆలయ ధర్మకర్తల మండలి నియామకమూ అంతే ప్రతిష్టాత్మకంగా మారింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటుతున్నా ఇప్పటివరకు ధర్మకర్తల మండలి నియామకం జరగకపోవడం ఆశావహులను బాధిస్తోంది. పాలకమండలి ఛైర్మన్ రేసులో తీవ్ర పోటీ ఉండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. టీడీపీలో ఎమ్మెల్యే బొజ్జల వర్గం, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ వర్గం, జనసేనలో వినుత వర్గం, బీజేపీలో కోలా ఆనంద్ వర్గం ఎవరికి వారు అధిష్టానం ఎదుట ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయితే నిన్నటి వరకు రంగినేని చెంచయ్య నాయుడు పేరు మాత్రమే ప్రముఖంగా వినిపిస్తూ వస్తోంది. ఆయనకు ఎమ్మెల్యే అండదండలు మెండుగా ఉన్నాయనే కోణంలో ఈ ప్రచారం జరిగింది. అయితే రెండు రోజులుగా మాజీ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఆయనకి ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి ఖరారు అయినట్లుగా కూటమినేతలు ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి పై గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు కూటమి వర్గాల్లో, ఆశావహుల్లో తీవ్ర దుమారాన్ని లేపాయి.

నా మద్దతు రంగినేనికే..!!

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గా టీడీపీ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు పేరును మాత్రమే ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద తాను ప్రతిపాదన చేసినట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. చిత్తశుద్ధి ఉన్న వ్యక్తిగా తాను ఆలోచించాకే చెంచయ్య నాయుడు పేరును ప్రతిపాదించినట్లు ఆయన స్పష్టం చేశారు. గడిచిన పదేళ్లుగా చెంచయ్య నాయుడు కుటుంబం టీడీపీకి అండగా నిలుస్తోందని తెలిపారు. ఎన్నో కేసులు పెట్టినా రంగినేని, ఆయన కుటుంబం వెనక్కి తగ్గలేదన్నారు. ఆయన పడ్డ కష్టం, శ్రమ ఆధారంగా కూటమిలో రంగినేని చెంచయ్య నాయుడుకే ధర్మకర్తల మండలి అధ్యక్ష పదవి దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. తన విజయంలో కూటమిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి సహకారం ఉందన్నారు. వారంలోపు ధర్మకర్తల మండలి ఏర్పాటు అవుతుందని పేర్కొన్నారు. సభ్యుల ఎంపిక అధిష్టాన నిర్ణయమన్నారు. బీజేపీ, జనసేన లో కూటమి విజయంలో పాత్ర, తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నైరాశ్యంలో ఆశావహులు

ఇప్పటివరకు ధర్మకర్తల మండలి చైర్మన్ రేసులో రంగినేని చెంచయ్య నాయుడు, డాక్టర్ నైనారు పొన్నారావు, రెండి ఎారి గంగవారెడ్డి, సత్రవాడ ప్రవీణ్, గాలి చలపతి నాయుడు, కన్నలి ప్రతాపరెడ్డి, కోలా ఆనంద్, కోటా వినుత తండ్రి ఉన్నారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా చెంచయ్య నాయుడితో కూడిన సేవా కమిటీని నియమించడంతో అధికారిక పాలకమండలిలో కూడా వీరే ఉంటారన్న సంకేతాలు వచ్చాయి. అయితే ఎవరికి వారు అధిష్టానం వద్ద మొరపెట్టుకోవడంతో పాలక మండల నియామకం వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బొజ్జల చేసిన వ్యాఖ్యలు ఆశావహులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టేశాయి.

సచివాలయంలో చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం

తిరుపతి తొక్కిసలాటపై చర్చ

మంత్రిమండలిలో కీలకాంశం
భవన క్రమబద్ధీకరణపైనా నిర్ణయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సమావేశం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో గురువారం జరిగింది. దాదాపు 42 అంశాలపై నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా జనవరి నెలలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 8వ తేదీ రాత్రిపూట జరిగిన తొక్కిసలాటపై తీవ్రంగా చర్చ నడిచింది. ఏకసభ్య కమిషన్ జస్టిస్ సత్యనారాయణ ఇచ్చిన నివేదికపై సుదీర్ఘంగా చర్చించారు. పద్మావతి పార్కు వద్ద రెండు రోప్ పార్టీలు టిటిడి, పోలీసు సిబ్బంది ఉన్నప్పటికీ సరైన రీతిలో ఉన్నతాధికారుల ఆదేశాలను గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి, డిఎస్‌పి రమణకుమార్ పాటించలేదని నివేదిక పేర్కొంది. రెండు అంబులెన్స్‌లో ఉన్నప్పటికీ గాయపడిన వారిని సరైన రీతిలో తరలించలేదని, ఈ కారణంగానే ఆరుగురు చనిపోయారని తేల్చింది. ఆ ఇరువురిపై కఠిన చర్యలు తీసుకోవాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఎస్‌పి సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఓ శ్రీధర్‌లు సమన్వయంతోనే వ్యవహరించారని నివేదిక తేల్చింది. దీంతో ఇరువురికీ క్లీన్‌చిట్ ఇచ్చింది.

అలాగే తిరుపతిలో భవనాల క్రమబద్ధీకరణపైనా చర్చ నడిచింది. తిరుపతిలో భవనాల క్రమబద్ధీకరణపై చట్టం తీసుకొచ్చి, భవిష్యత్‌లో ఎలాంటి అక్రమ కట్టడాలు నిర్మించకుండా చర్యలు తీసుకురానున్నట్లు నిర్ణయించారు. అయితే రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ జోక్యం చేసుకుని తిరుపతికి ఎన్నిసార్లు మినహాయింపు ఇచ్చామని, హద్దంటూ ఉండదా? అని సీరియస్‌గా వ్యాఖ్యానించడంతో సీరియస్‌గానే చట్టం తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే 2024-25 సంవత్సరానికి నీటిపన్నుపై వడ్డీని పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించారు. రూ.50వేల కోట్ల పెట్టుబడులతో గ్రీన్‌హైడ్రోజన్, ఐటి రెన్యువలబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ జోన్, ఆటోమొబైల్ సంస్థల్లో లక్ష ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుబడులు రానున్నాయని సిఎం చెప్పారు. త్వరలోనే నిరుపేదలకు కూటమి ప్రభుత్వ హామీలో భాగంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ విషయమై మంత్రులందరూ దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగుభూమిని వ్యవసాయేతర భూమిగా మార్చే చట్టంపైనా చర్చ నడిచింది. లేఔట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి చట్టసవరణపైనా చర్చ నడిచింది.

కులదురహంకారంపై జాషువా కలం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

కులదురహంకారంపై గుర్రం జాషువా తన కలాన్ని ఝుళిపించారని వక్తలు ఉద్ఘాటించారు. జిల్లావ్యాప్తంగా గుర్రం జాషువా 54వ వర్ధంతి పురస్కరించుకుని నివాళి అర్పించారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సభకు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున అధ్యక్షత వహించారు. జాషువా కేవలం కవి మాత్రమే కాదని, సామాజిక విప్లవ జ్యోతి అని ప్రశంసించారు. సమానత్వం, అణచివేతల వ్యతిరేకత ఆయన రచనల మూలసారం అని కీర్తించారు. ఎస్వీయూ పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ జాషువా రచనలు దళిత సామాజిక చైతన్యానికి మార్గదర్శి అని అన్నారు. గబ్బిలం, ఫిరదౌసి, నాకథ పద్యకావ్యాలు, ఖండకావ్యాలు, కవిత్వాలు శిలాశాసనాల్లా ప్రజల మనస్సుల్లో నిలిచిపోయాయన్నారు. సాహితీ స్రవంతి నాయకులు ఒ.వెంకటరమణ మాట్లాడుతూ కులదురహంకారాన్ని వ్యతిరేకించాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల మల్లేశ్వరరావు, రెడ్డెప్ప, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ ఆమూరి సుబ్రమణ్యం, రఫీ, ముఖేష్, సంధ్య, లత, ప్రమోద్ పాల్గొన్నారు.

- రేణిగుంట బాలికల పాఠశాలలో జాషువా రచించిన "కులమతాలు గీసుకున్న గీతలజొచ్చి పంజరాన గట్టుపడను నేను నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తరుగులేదు విశ్వనరుడను నేను "పద్యాన్ని విద్యార్థినులతో కలసి సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఒ.వెంకటరమణ, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, భారతమ్మ, మోహనకుమారి పాల్గొన్నారు.
- గూడూరులో కెవిపిఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. సామాజిక రుగ్మతలను తన కలంతో ఎదుర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, ఎంబేటి చంద్రయ్య, గుర్రం రమణయ్య పాల్గొన్నారు.
- బిఎన్ కండ్రిగలో అరసం జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆధునిక సాహిత్యంలో తన పదునైన రచనల ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించి ఆలోచింపజేసిన మహాకవి గుర్రంజాషువా అని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత, సుజన, దాసు పాల్గొన్నారు.

వేమన విజ్ఞాన కేంద్రంలో...

మిథున్ రెడ్డి అరెస్టు అక్రమం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి అరెస్టు అక్రమమంటూ స్థానిక గుడి వీధిలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గురువారం వైసీపీ నేతలు నల్ల జెండాలతో నిరసన తెలియజేశారు. చంద్రబాబు తమ రాజకీయ లబ్ధి కోసం మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి విమర్శించారు. కక్ష పూరిత రాజకీయాలు ఎల్లకాలం సాగవనీ, కూటమి అరాచకాలపై ప్రజలు తిరగబడే కాలం దగ్గర్లో ఉందని హెచ్చరించారు. ప్రశ్నిస్తానని వచ్చిన పవన్ కళ్యాణ్ ప్రజలను గాలికి వదిలేసి, తన సినిమా రేట్లు దారుణంగా పెంచుకొని, దీని కోసమే రాజకీయాలకు వచ్చానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. లిక్కర్ స్కామ్ అనేది వట్టి అభూతకల్పననీ, జగన్ కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను ఓర్వలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ విమర్శించారు. అంజూరూ తారక శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరుశురామేశ్వరుడి సన్నిధిలో ఏపీ శాసనసభ జనరల్ సెక్రటరీ

ప్రజాశక్తి -ఏర్పేడు

ఏర్పేడు మండలం, గుడిమల్లం శ్రీ పరశు రామేశ్వర స్వామి దర్శనార్థం ఏపీ శాసనసభ జనరల్ సెక్రెటరీ ప్రసన్నకుమార్ సూర్యదేవర సహా బందంతో కలిసి విచ్చేశారు. వీరికి ఆలయ ఈవో రామచంద్రారెడ్డి స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను, చరిత్రను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వంశీకష్ణ శర్మ పాల్గొన్నారు. గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర ఆలయానికి చిలకూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు రంగరాజన్ విచ్చేయడంతో ఆలయ సిబ్బంది ప్రత్యేకంగా ఆహ్వానించి స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం వినాయకుని మండపం వద్ద ఆయనకు ప్రత్యేక పూజను ఏర్పాటు చేసి ఆలయ అర్చకుడు వంశీ కష్ణ శర్మ ఆయన నుండి ఆశీర్వచనం తీసుకున్నారు.

చెత్త నిర్వహణపై 'ఎజిఎస్'తో ఒప్పందం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన తిరుపతి సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరంలోని ప్రతి ఇంటి వద్ద చెత్త వేరు చేసి ఇవ్వడంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఐటిసి తరపున అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ (ఏ.జి.ఎస్.) స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గురువారం కమిషనర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. వ్యర్థాలను విభజన చేసేలా ప్రజలను ప్రోత్సహించి, ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన తిరుపతిని సాధించడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అన్నారు. అలాగే రీసైక్లింగ్ చేయడం, హెూమ్ కంపోస్ట్ చేయడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపాలకష్ణ మూర్తి తో నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఏజీఎస్ ప్రాంతీయ సమన్వయకర్త కుమారి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు అభినందనలు

కమిషనర్ మౌర్య కృషితోనే తిరుపతి స్వచ్ఛ సూపర్‌లీగ్ అవార్డు తీసుకున్నామని డిప్యూటీ మేయర్లు పేర్కొన్నారు. కమిషనర్‌గా మౌర్య బాధ్యతలు స్వీకరించి ఏగాది గడచింది. ప్రతిరోజూ శానిటేషన్ వర్కర్లతో కలిసి వార్డులన్నీ కలియతిరుగుతూ శుభ్రంగా ఉంచడం వల్లనే రాష్ట్రపతి చేతుల మీదుగా ఢిల్లీలో అవార్డు తీసుకున్నారని తెలిపారు. డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్‌సి మునికృష్ణ, కార్పొరేటర్లు బాబు, నరసింహ, నరేంద్రలు కమిషనర్‌ను శాలువతో సత్కరించారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పేదరికం నిర్మూలన దిశగా పి -4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు బాటమ్ 20శాతం బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారికి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలతో పి-4 పై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పి- 4 కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. శ్రీకాళహస్తి, నాయుడుపేట, సత్యవేడు, గూడూరు తదితర మండలాల్లో కంపెనీలు ఉన్నాయని ఈ కంపెనీలు తమ పరిధిలోని ఒక గ్రామం, కొన్ని కుటుంబాలను గుర్తించి ట్యాగ్ చేసుకోవాలని తెలిపారు. వారికి కావాల్సిన విద్య నైపుణ్యం వంటి అవసరాలను తీర్చేలా మార్గదర్శకులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తుంబూరు పాఠశాల విలీనాన్ని ఆపాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

తుంబూరు దళితవాడ పాఠశాల విలీనాన్ని ఆపాలని విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎంఇఒ, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్‌కుమార్, మాజీ ఉపాధ్యక్షులు డి.మహేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 117ను తీసుకొచ్చి మూడు కిలోమీటర్ల లోపల ఉన్న పాఠశాలను విలీనం చేస్తుందన్నారు. విలీనం పేరుతో పాఠశాలను మూసివేయడం దారుణమన్నారు. తుంబురు దళితవాడలో 56 మంది విద్యార్థులు చదువుతుండగా, తక్కువగా పది మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో విలీనం చేయడం ఏంటని ప్రశ్నించారు. పాఠశాలను యథావిధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒ, తహశీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, ఇందుమతి, సారా, భాగ్యరాజ్, గోవిందయ్య పాల్గొన్నారు.

చెవిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం : చింతల

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి గురువారం చేరుకున్న ఆయన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీని పరామర్శించి ధైర్యం చెప్పారు. లిక్కర్ స్కాం కేసులో అక్రమంగా చెవిరెడ్డిన అరెస్టు చేసి జైలులో బంధించడాన్ని ఆయన తప్పుబట్టారు. చెవిరెడ్డి, మిథున్‌రెడ్డి వంటి వ్యక్తులను జగనన్నకు దూరం చేయాలని కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ తప్పుడు కేసుల్లో ఇరికించడం దుర్మార్గమన్నారు. పాతికేళ్ల తరువాత టీడీపీ గెలిచిన చంద్రగిరి నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేసుకునేందుకు చెవిరెడ్డితో పాటు ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై కూడా అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ప్రజలు కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను గమనిస్తున్నారన్నారు. ప్రజలకు అవకాశం వచ్చినపుడు కూటమి పార్టీలకు తగిన బుద్ధి చెబుతారని, అందరూ జగనన్న వైపు నిలబడే రోజు వస్తుందన్నారు. అప్పటి వరకు తప్పుడు కేసులతో ఇబ్బందులు పడక తప్పదన్నారు. చెవిరెడ్డి కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆయన భరోసా కల్పించారు.

ఏరియా ఆస్పత్రికి పూర్వవైభవం

అభివృద్ధి కమిటీ నియామకం / పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు
సిబ్బందికి ఉచిత ఇన్సూరెన్స్ / పెద్దాస్పత్రిపై బొజ్జల వరాల జల్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆర్నెల్ల కాలంలో అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. తన తండ్రి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి మానస పుత్రికగా విరాజిల్లిన ఏరియా ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీని గురువారం ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ఏరియా ఆసుపత్రి, సిబ్బందిపై వరాల జల్లు కురిపించారు. వైద్యులతో కలిపి 134 మంది సిబ్బందికి ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఆసుపత్రికి అవసరమైన అత్యాధునిక వసతులను ఆరు నెలల్లో సమకూరుస్తామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ, శ్రీకాళహస్తి ఆలయం, పరిశ్రమలు, దాతల సహకారంతో ఆసుపత్రిని తిరుపతి జిల్లాలోనే అత్యుత్తమంగా నిలుపుతున్నట్లు చెప్పారు. తుడా సహకారంతో ఆసుపత్రి చుట్టూ పచ్చదనాన్ని పెంపొందిస్తామని తెలిపారు. ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పని దొంగల వివరాలు వెల్లడిస్తే పని పడతామని హెచ్చరించారు. ఆసుపత్రి ముందుభాగంలో పోలీసు అవుట్ పోస్టును వెంటనే(శనివారం కల్లా) ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. అనంతరం నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో నడుస్తున్న డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి మౌలిక వసతులు మెరుగు పరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దాత ఆశ్రిత ఇన్ఫ్రా అధినేత శ్రీధర్ వర్మ రూ. 5 లక్షలు విలువ జేసే సామగ్రిని ఆసుపత్రికి అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మణి పాల్గొన్నారు.

హెచ్‌డీఎస్ సభ్యుడుగా గరికపాటి



శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి డెవలప్మెంట్ సొసైటీ సభ్యుడిగా గరికపాటి రమేష్ బాబును నియమించారు. ఈ సందర్భంగా గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ నియోజక వర్గంలోని ప్రజలందరికీ ఉన్నత వైద్యం అందేలా తన వంతు పాటు పడతానని అన్నారు. తనకు పదవి రావడానికి కారణమైన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కు ధన్యవాదాలు తెలిపారు.

విద్యావనరుల కేంద్రంలో సిబ్బంది కొరత

మూడేళ్లుగా ఇద్దరు సిఆర్‌పిలు, ఒక ఎంఐఎస్ లేరు

ప్రజాశక్తి- తొట్టంబేడు

ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్లలు బాగా చదువుకొని భవిష్యత్తులో ఎంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడుతోంది. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల జాబితాను ఎప్పటికప్పుడు మండల విద్యా వనరుల శాఖ కార్యాలయంలో పొందుపరచడానికి సమగ్ర శిక్ష ప్రాజెక్టు ద్వారా సీఆర్పీలను, ఎంఐఎస్ లను ప్రభుత్వం నియమించింది. మండలంలో మొత్తం 75 పాఠశాలలు ఉన్నాయి. అందులో 63 ప్రాథమిక పాఠశాలలు, 12 ఉన్నత పాఠశాలలో ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 3వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థుల హాజరు నమోదు మొదలుకొని తల్లికి వందనం, సర్వేపల్లి రాధాకష్ణ విద్యార్థి మిత్ర కిట్లు, మధ్యాహ్న భోజనం పథకం, బడికి మధ్యలో నిలిచిపోయిన పిల్లల సమాచారం, విద్యార్థుల ఆధార్ కార్డు నెంబర్లు సేకరించడం వంటి సమాచారాలను పాఠశాలల నుంచి సేకరించి మండల విద్యా వనరుల కేంద్రంలో విధులు నిర్వహించే ఎం.ఐ.ఎస్ లకు అందిస్తారు. అలాగే బడికి మధ్యలో నిలిచిపోయిన విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి విద్యార్థులను బడిలో చేర్పించడానికి కషి చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవు తీసుకున్నప్పుడు ఆ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు విద్యను బోధిస్తారు. మండలంలో మొత్తం నలుగురు సీఆర్పీలు విధులు నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు సిఆర్పిలే విధులు నిర్వహిస్తున్నారు. సీఆర్పీలు ఇచ్చిన సమాచారం మొత్తాన్ని ఎం.ఐ. ఎస్ లు ఆన్ లైన్ లో పొందుపరిచి జిల్లా విద్యా వనరుల శాఖ కార్యాలయానికి చేరవేస్తారు. అయితే ఇంతవరకు బాగానే ఉంది. 75 పాఠశాలలు ఉండి 3000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న తొట్టంబేడు మండలంలో మూడు సంవత్సరాల కాలం నుంచి ఇద్దరు సి.ఆర్.పి లే విధులలో ఉండట,ం సీఆర్పీలు ఇచ్చిన సమాచారాన్ని ఆన్ లైన్ లో పొందుపరిచి జిల్లా కార్యాలయానికి సమాచారాన్ని పంపించే ఎం.ఐ.ఎస్ లేకపోవడం ఎంతో ఆశ్చర్యానికి గురి చేసే విషయం. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రతి ఒక్క సంక్షేమ పథకం తప్పక అందాలంటే సీఆర్పీలు, ఎం.ఐ. ఎస్ ల కొరత లేకుండా చూడాలని గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ విషయమై మండల విద్యా వనరుల శాఖ అధికారిని సి.హెచ్ మంజు భారతిని వివరణ కోరగా గత మూడు సంవత్సరాల నుంచి సీఆర్పీలు, ఎం.ఐ.ఎస్ ల కొరత ఉన్న విషయం వాస్తవమేనని అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో సీఆర్పీలు, ఎంఐఎస్ ల కొరత లేకుండా చూడాలని పై అధికారులకు నివేదిక పంపామన్నారు.

సిఆర్‌సి జాయింట్ సెక్రెటరీగా సమితి వెంకటేష్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వెస్ట్ వరత్తూరు పంచాయతీ, కొత్త కండ్రిగ, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న సమితి వెంకటేశను సిఆర్‌సి జాయింట్ సెక్రెటరీగా ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో సిఆర్సి పరిధిలో ఉన్న ఉపాధ్యాయుల ఏ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పీ4 సర్వేతో పేదలకు ఆర్థిక మేలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పీ4 సర్వేతో పేదలకు ఆర్థికంగా మేలు జరుగుతుందని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె, గ్రామ కార్యదర్శులతో పీ4 సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీ4 సర్వే ద్వారా అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి, వారి ఆర్థిక స్థితిని మెరుగుపరిచి, పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమ నిర్వహణ ఉంటుందన్నారు. ఈ సర్వేలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక సహాయం, సామాజిక సేవలపై దృష్టి పెట్టడం ద్వారా అభివృద్ధి చేకూరుతుందని తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 14 లక్షల 73 వేల రూపాయల, 20 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు, రామానాయుడు కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ గురువారం స్వయంగా పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరు నిలిచిపోవడం, కాలువల శుభ్రత లేకపోవడంతో, నీరు ముందుకు సాగక పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్, డ్రైనేజీ కాలువలు వెంటనే శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. భవనాల భద్రతకు, పారిశుధ్యానికి పెద్దపీట వేస్తామని స్థానికులకు తెలిపారు.

విశ్వం స్కూల్‌లో 'ఇన్‌కమ్ ట్యాక్స్ డే'

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి, జీవకోన విశ్వం హై స్కూల్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్ డే వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా, డా.కె.ఎం.లక్ష్మణ్ కుమార్, ఐఆర్‌ఎస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్, సర్కిల్-1, తిరుపతి ఆధ్వర్యంలో, ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆదాయపు పన్ను శాఖ అధికారులకు విశ్వం విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్. విశ్వ చందన్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థుల్లో ఆదాయపు పన్ను ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియచేశారు.

దుగరాజపట్నం సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు దుగరాజపట్నం సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. సచివాలయానికి సంబంధించిన రికార్డులు, సిబ్బంది హాజరు పట్టీ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర, పీ4 లకు సంబంధించిన సర్వే స్థితిని పంచాయతీ కార్యదర్శి సురేష్‌ని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ త్వరగా సచివాలయ పరిధిలో పీ4 సర్వే ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో డిజిటల్ అసిస్టెంట్ ప్రవీణ్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

'మేక్ ఇన్ ఇండియా'కు కొత్త శకం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం యుకెఎస్‌టిఎఫ్‌కు కొత్త శకం కానుందని టివిఎస్ మోటార్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ వేణు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్యం ప్రేరణనిచ్చిందన్నారు. ఇండియా -యుకె స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడం ఒక కీలకమైన క్షణం అని తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రపంచానికి తీసుకెళ్లడానికి కొత్త సరిహద్దులను తెరుస్తుందన్నారు. ఈ సంవత్సరం కొత్త నార్టన్ వాహనాలను విడుదల చేయనున్న సమయంలో ఈ పని జరుగనుండడం మంచిదని తెలిపారు. ప్రపంచ స్థాయి ఉత్పత్తులు, బ్రాండ్‌లను నిర్మించాలనే సంకల్పాన్ని బలపరుస్తుందన్నారు.

పరీక్షా కేంద్రాల్లో రిజిస్ట్రార్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - క్యాంపస్: యస్వీయూలో ఈ నెల 19 నుంచి జరుగుతున్న ఎంబిఏ నాల్గవ సెమిస్టర్ పరీక్ష గదులను రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు గురువారం పరిశీలించారు. ప్రశాంత భవన్లో జరిగే పరీక్షల తీరును ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. గదుల్లో గాలి, వెలుతురు సదుపాయాలు సరిగ్గా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు కాపీలకు పాల్పడకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సుపరిపాలనలో తొలిఅడుగుకు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండల పరిధిలోని అనుపల్లెలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ డి.బిందు మాధవి మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సోము రాయల్, బండి విజయ్ కుమార్ రెడ్డి, బూత్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ మూసివేతకు కుట్ర

- శివాలయ భూమి అంటూ అసత్య ప్రచారం
- పేదల ఆకలితో వైసీపీ రాజకీయం : టీడీపీ మండల అధ్యక్షుడు జీవరత్నం నాయుడు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు, అన్నా క్యాంటీన్ మూసివేయాలన్న ప్రయత్నాల వెనుక వైసిపి నాయకుల రాజకీయ కుట్ర ఉందని, ఇది ప్రజా సంక్షేమానికి విరుద్ధమైన చర్యగా గుర్తించాలని టీడీపీ మండల అధ్యక్షుడు జీవరత్నం నాయుడు ఆరోపించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ ద్వారా ప్రతి రోజూ వందలాది మంది పేదలకు ఐదు రూపాయలకే భోజనం అందుతోందన్నారు. ఇలాంటి పథకాన్ని నిలిపివేయాలని కుట్రలు పన్నడం దారుణమన్నారు. వైసిపీ నాయకులు ఈ క్యాంటీన్ శివాలయ భూమిలో నిర్మించబడిందని అసత్య ప్రచారం చేస్తూ మూసివేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ భూమి పుత్తూరు పట్టణంలో 301/2 సర్వే నెంబర్‌లో ఉన్న గ్రామ కంఠానికి చెందిన ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారు. తహశీల్దార్ ద్వారా మున్సిపాలిటీకి ఈ భూమిని అధికారికంగా అప్పగించినట్లు పత్రాలు ఉన్నాయని తెలిపారు.

చరిత్రలోకి వెళితే శంకు స్థలమే ఇది

ఈ భూమి చరిత్రకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. 1958లో, అప్పట్లో పంచాయతీ పరిపాలనలో ఉండగా, ఈ స్థలాన్ని ఆలయ నిర్వాహకులు, కార్వేటినగరం సంస్థానాధీశులు పంచాయతీకి లీజుకు ఇచ్చారు. ఈ భూమిలో ప్రతి ఉదయం శంకు ఊదుతూ సమయపాలనకు సంకేతం ఇచ్చేవారు. అప్పట్లో గ్రామస్తులకు గడియారాలు లేని సమయంలో ప్రజలు ఈ శబ్దాన్ని ఆధారంగా చేసుకుని తమ వ్యవసాయ, కూలి పనులకు వెళ్లేవారు. ఈ శంకు ఉత్సవ స్థలం కావడంతో, పంచాయతీ ఈ స్థలాన్ని తాత్కాలిక వినియోగానికి లీజు తీసుకుని ఆలయానికి పన్ను చెల్లిస్తూ వచ్చింది. అందుకే, ఈ భూమి అసలు యాజమాన్యం ఆలయానిదే అయినా, పంచాయతీ వినియోగించిన చరిత్ర కూడా ఉందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. అయితే, ప్రస్తుతం అన్నా క్యాంటీన్ మాత్రం మున్సిపల్ పరిపాలనలో, ప్రభుత్వ భూమిలోనే కొనసాగుతోందని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆలయ అధికారులు స్పందన

ఈ వ్యవహారంపై ఆలయ కార్యనిర్వహణాధికారి జయకృష్ణ స్పందిస్తూ ఇటీవలే బాధ్యతలు స్వీకరించానని, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, సమాచారం త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

ఆశ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు పరచడంలో ఆశా వర్కర్స్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరులో ఏఐటీయూసీ ఆశా వర్కర్స్ యూనియన్ డివిజన్ జనరల్ బాడీ సమావేశం మారెమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హేమావతి, చాముండేశ్వరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్మికులను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, యునిఫారం, టిఏ, డిఏ, ఇన్సూరెన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఫించన్ ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లను గౌరవంగా చూడాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఏఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఆగస్టు 17న ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు పుత్తూరులో జరుగుతాంని, 30, 31 తేదీల్లో రాష్ట్ర మహాసభలు కడపలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలలో ఆశా వర్కర్స్ అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు మహేష్, ఏఐటీయూసీ నాయకులు రమేష్, శరవణ కృష్ణారెడ్డి, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మారెమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం నిర్మూలన

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం, బండారుపల్లిలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో గురువారం గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజవేలు మాట్లాడుతూ విద్యతోనే పేదరికం, నిరక్షరాస్యత రూపుమాపబడుతుందని తెలిపారు. ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించుటకు కృషి చేస్తున్నామన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలన్నారు. గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం, పాలు గుడ్లు పంపిణీ అందిస్తున్నామని తెలిపారు. మహిళా పోలీస్ బతుకమ్మ బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. శ్రీకాళహస్తి మండలం కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, కార్యదర్శి బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రగతి సిబ్బంది వెంకటేష్, మురుగయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తలకోన అభివృద్ధికి రూ.18 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే పులివర్తి నాని కృషి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 18 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు టిడిపి మండల నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తలకోన ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలని టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడుకు వివరించి ప్రతిపాదనలు పంపించారన్నారు. తక్షణమే పనులు ప్రారంభించాలని ఆలయ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వాటర్ ఫాల్స్, నాలుగు మాడ వీధులు, కోనేరు, గోశాల, తాగునీరు, వైద్యం, భక్తులకు మౌలిక సదుపాయాలు తదితర అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సోమనాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిన్న తనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న శివ కుటుంబా నికి అండగా ఉంటామని రాజ నేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు తెలియజేశారు. తమ వంతుగా ట్రస్టు తరపున ఆ కుటుంబానికి నగదు సాయం అందజేశారు. గూడూరు మండలం, విందూరు, గిరిజన కాలనీకి చెందిన ఏకుల శివ (15) తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో, చదువు మానేసి ఇద్దరు తమ్ముళ్లను, చెల్లెళ్లను పోషించుకుంటూ దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాడు. వారి పరిస్థితి తెలుసుకున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసులు నాయుడు, ట్రస్టు సభ్యులు బాబు, ప్రజేంద్ర రెడ్డిల ద్వారా శివ కుటుంబానికి 15వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందించారు.

సోషల్ మీడియా యాక్టివిటీస్‌తో ప్రాణహాని ఉంది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సోషల్ మీడియా యాక్టివిస్టుగా సమాజంలో చలామణి అవుతూ ఆడవారి జీవితాలతో ఆడుకుంటున్న హేమాద్రి అనే వ్యక్తి వలన తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని హీన అనే మహిళ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన కుమార్తె తనీషా సుల్తానాను హేమాద్రి అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేశామని, దీనిపై తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదయిందన్నారు. అయితే జనసేన పార్టీ వీర మహిళ అంటూ నిర్మల, మరో జనసేన నాయకుడు తపసి మురళి రెడ్డి అనే కొంతమంది నకిలీ జర్నలిస్టులు హేమాద్రికి మద్దతుగా నిలుస్తూ నా కుటుంబ వ్యవహారాల ఫోటోలను చూపించి బెదిరిస్తున్నారన్నారు. కేసును వెనక్కు తీసుకోవాలని బెదిరుస్తున్నారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చండి : మురళి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మాజీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవుళ్ళ మురళి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెర కులస్తులు చట్టసభలలో తమ వాణిని వినిపించలేక, హక్కులను సాధించుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా త్వరలో వడ్డెర మహాసభను నిర్వహిస్తామన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిస్సా తదితర రాష్ట్రాలలో వడ్డెర కులస్తులు ఎస్టీ జాబితాలో ఉన్నారని, వారందరినీ ఈ మహాసభకు ఆహ్వానిస్తామన్నారు. అర్హులైన వడ్డెరలకు 25 శాతం క్వారీలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, మదన్మోహన్, నాగరాజు, బాల, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి సిహెచ్‌సిలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పద్ధతిల్లో పనిచేస్తున్న చెంజి సుబ్బరాయుడు, సూపర్వైజర్ జయలక్ష్మి లను విధుల్లో నుండి తొలగించి ఉన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ వెంటనే స్పందించి తొలగించి ఉన్న వారందరినీ పనిలోకి తీసుకోవాలని కోరారు. గత 20 సంవత్సరాల నుండి వీరు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఉన్నట్టుండి ఇంత సర్వీస్ ఉన్న వారిని తీసేస్తే వారి కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. వెంటనే పనిలోకి తీసుకోకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

36వ రోజూ నిరసన దీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: సిఐటియు ఆధ్వర్యంలో రామారావును వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి 36వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా గత పది సంవత్సరాల నుండి వెంకటగిరి మున్సిపాలిటీ లోనే శానిటరీ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్విస్తున్న రామారావుని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రామారావు సిఐటియు ఉన్న లీడర్స్‌ని బెదిరిస్తున్నారని, ఎవరిని బెదిరించారనేది కమిషనర్‌కు, ఉన్నతాధికారులకు తెలియచేశామన్నారు. రామారావుకు యూనియన్ విషయాల్లో జోక్యం చేసుకోరాదన్నారు. ఆనను బదిలీ చేసేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, సుబ్బరత్నమ్మ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రమణమూర్తికి మెరిటోరియస్ టీచర్ అవార్డు



ప్రజాశక్తి - క్యాంపస్: ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 57వ వార్షిక స్నాతకోత్సవం సందర్భంగా, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో గణాంక శాస్త్రం, కంప్యూటర్ అనువర్తనాలు విభాగంలో సహ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న డా. బి. రమణ మూర్తికి మెరిటోరియస్ టీచర్ అవార్డు - 2023 లభించింది. ఈ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ బి.రమణమూర్తిని బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రేణిగుంట: జూలై 30వ తేదీన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, జూలై 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రతి రైల్వే స్టేషన్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్ ద్వారా ప్రగతి సంస్థ రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో గురువారం రేణిగుంట రైల్వే స్టేషన్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఫ్లాట్ ఫార్మ్ పైన ప్రయాణికులకు పాంప్లెట్స్ పంచిపెట్టి మానవ అక్రమ రవాణా పైన అవగాహన కలిగించారు. ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు, మహిళలు ఈ అక్రమ రవాణా లో చిక్కుకుని అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. రైళ్లలో పిల్లలను తీసుకెళ్తున్న అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే 1098, 1800, 1027, 222 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు , ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ, స్టేషన్ మాస్టర్ శేషగిరి నాథ్ రెడ్డి , ఎస్సై డి రమేష్, ప్రగతి సంస్థ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ మధు కుమార్ లత పాల్గొన్నారు.

డీఆర్డీఏ ద్వారా పేదరిక నిర్మూలన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : డీఆర్డీఏ ద్వారా పేదరిక నిర్మూలనే కాకుండా ఆదాయం పెంచే మార్గాలను కూడా అన్వేషించాలని డీఆర్డీఏ పీడీ శోభన్ బాబు సూచించారు. గూడూరు, ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జేఎల్ ఎంబీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాల మంజూరుకు సంబంధించి బ్యాంకు లింకేజీలను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి కల్పనతోపాటు యూనిట్లు నెలకొల్పేవారికి ప్రోత్సాహం ఉంటుందని, మహిళా ఔత్సాహిక వేత్తలను ఉత్సాహపరచాలని కోరారు. రుణాల మంజూరుకు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులందరూ ఆన్లైన్ ద్వారా బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం రవికుమార్, ఏపీజీబీ ఆర్.ఎం. మోహన్ రెడ్డి, హ్యాండ్లూమ్ ఏడీ రమేష్, డీఆర్డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి, గూడూరు ఇన్చార్జి ఎంపీడీఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యస్వీయూలో ఫుడ్ సైన్స్ కార్యశాల

ప్రజాశక్తి - క్యాంపస్: యస్వీయులో ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్, డైటిక్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్ విభాగం అప్లికేషన్స్ ఆఫ్ టెక్చర్ అనాలిసిస్ ఇన్ ఫుడ్ సైన్స్ అనే అంశంపై ఒక రోజు కార్యశాల నిర్వహించింది. ఈ కార్యక్రమంలో యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యస్వీయూలో ఫుడ్ టెక్నాలజీ విభాగాన్ని, ఆహార ఉత్పత్తి పరిశ్రమలను అనుసంధానం చేయడం జరుగుతుందని, హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆహార ఉత్పత్తుల పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సదస్సుకు ఆచార్య మంజుల అధ్యక్షత వహించగా, ఆచార్య కెవి సుచరిత నిర్వహణ కార్యదర్శిగా వ్యవహరించారు. విభాగం ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇంటికి నిప్పుపెట్టిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ పరిధి, దొడ్లమెట్టలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక యువకుడు నవీన్ ప్రసాద్ (24), అతని తండ్రి రవీంద్రబాబు వందరోజుల కరువు పనులు చేస్తూ జీవనం గడుతున్నారు. బాధితుడు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన ద్రాక్షాయిని అనే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఆమె భర్త రామాంజనేయులు, అతని అన్న ఆదినారాయణ గురువారం వేకువ జామున బాధితుడి ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయినా, బాధితుడి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ మంటల్లో దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, సీఐ జయచంద్ర ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దేవాలయంలో చోరీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని అక్కర పాక, మొలక వేములమ్మ గుడిలో బుధవారం రాత్రి దొంగలు పడి రెండు హుండీలు అపహరించి పోయినట్లుగా గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ కృష్ణారెడ్డి గుడి వద్దకు వెళ్లి పరిశీలించి, ముళ్ల చెట్ల పొదల్లో దొంగలు వదిలి వెళ్ళిన హుండీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తులు వివరాల మేరకు ఈ రెండు హుండీలలో సుమారు 50 వేల రూపాయలు ఉండవచ్చని తెలిపారు.

హరి హర వీరమల్లు ప్రదర్శనలో వివాదం

- థియేటర్ అద్దాలు ధ్వంసం చేసిన ఆకతాయిలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన హరహర వీరమల్లు సినిమా ప్రదర్శనలో వివాదం చోటుచేసుకుంది. పట్టణంలోని ఆర్ఆర్ థియేటర్‌లో బుధవారం అర్ధరాత్రి హరహర వీరమల్లు ప్రీమియర్ షో వేశారు. అయితే ఓ కూటమినేత అనుచరులు వందలాదిమంది పవన్ అభిమానులతో కలిసి టికెట్లు లేకుండా థియేటర్లోకి చొరబడ్డారు. హాలు సామర్థ్యం కంటే ఎక్కువమంది లోపలికి వెళ్లడంతో టికెట్లు పొందిన వారికి సీట్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో థియేటర్ లోపల యువకులు పెద్ద ఎత్తున వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఆ కూటమినేత అనుచరులు మమ్మల్నే ఎదురిస్తారా..! మేము ఎవరో తెలుసా..! మేము తలుచుకుంటే ఏమవుతుందో ఊహించగలుగుతారా అంటూ.. నానా హంగామా చేశారు. దీంతో థియేటర్ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని యువకులను బయటకు వెళ్ళగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కూటమి నేత అనుచరుడు ఒకరు థియేటర్ అద్దాలను ధ్వంసం చేశారు. థియేటర్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీకి రూ.2 కోట్లు విరాళం



ప్రజాశక్తి -తిరుమల: హైదరాబాద్ కు చెందిన ట్రినిటీ కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు గురువారం రూ. 2 కోట్లు విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అదనపు ఈవో అభినందించారు.

సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ ?

ప్రజాశక్తి-కోట: కోట మండలం, విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలకు మోసం చేస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పేరుకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నారు తప్ప, అకౌంట్లో నగదు జమ కావడం లేదని, రైతు భరోసా, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు తదితర పథకాలను తుంగలో తొక్కారని యెద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వం జగన్ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. అనంతరం కోట మండల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా, వాకాడు మండలం, వాకాడు నేదురుమల్లి బాలకృష్ణ రెడ్డి సేవా క్షేత్రంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గూడూరు వైసీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత పాలన సాగిస్తూ అన్ని వర్గాల ప్రజలను ముంచేసారన్నారు. వైసీపీ ప్రధాన కార్యదర్శి కొడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ బాబు హామీల అమలులో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రైతు రామకృష్ణ, వాకాడు సర్పంచ్ రత్నమ్మ, కోటిరెడ్డి, సుధాకర్ నాయుడు, మండల ఎంపీటీసీ వెంకటరమణయ్య, రమణమ్మ, సర్పంచ్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.